సాక్షి

పార్వతీపురం మన్యం

శనివారం । 22 । మార్చి । 2025



'జల'కలం..! - 8లో

వేసవి ప్రారంభమైంది. జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. భూగర్భజలాలను సంరక్షించుకోవడంలో సరైన అవగాహన లేకపోవడంతో జల లభ్యతలో తగ్గుదల కనిపిస్తోంది.



వేతనదారులకు నిలువనీడ కరువు

ఉపాధిహామీ వేతనదారులకు సమస్యలు వెంటాడుతున్నాయి. పని ప్రదేశంలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
శని (సా)	ఆది (ఉ)
6.11	4.49

న్యూస్‌రీల్

23న ఉల్లాస్ అర్హత పరీక్ష



ఉల్లాస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: ఉల్లాస్ అక్షరాస్యత అర్హత పరీక్షను ఈ నెల 23న నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024 నవంబర్ 15వ తేదీ నుంచి 22,944 మంది వయోజనులకు 2,294 మంది వలంటీర్లతో చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు చేయగలగడం నేర్పించామని, వారి అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకునేందుకు పరీక్ష నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడమే 'ఉల్లాస్' ఉద్దేశంగా పేర్కొన్నారు. చదివేందుకు 50, రాయడానికి 50, గణితానికి 50 మార్కుల చొప్పున 150 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. ఇందులో 33 శాతం మార్కులు పొందిన వారిని ఉత్తీర్ణులుగా గుర్తించి ఎన్ఐఓఎస్ ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు, డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

బిత్రపాడులో ఏనుగులు



బిత్రపాడు పంట పొలాల్లో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని నిమ్మలపాడు, బిత్రపాడు పంట పొలాల్లో శుక్రవారం సాయంత్రం ఏనుగులు దర్శనమిచ్చాయి. నిమ్మలపాడు దగ్గర నాగావళి నదిలో ఉన్న ఏనుగులు సాయంత్రానికి బిత్రపాడు పొలిమేరకు చేరడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వరి, అరటిపంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు గగ్గోలుపెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగులు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఫారం పాండ్స్ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఫారంపాండ్స్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల అధికారులను ఆదేశించారు. పల్లె పండగ కార్యక్రమంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జిల్లా కలెక్టర్లు, డ్వామా పీడీలతో శుక్రవారం సమీక్షించారు. పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం మండల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పల్లె పండుగ పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

రక్తహీనత కేసులు తగ్గుముఖం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు దృష్టిశర్మ, జాస్మిన్

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వం రక్తహీనతను నివారించేందుకు ప్రవేశపెట్టిన పథకాలు క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలుచేస్తుండడంతో రక్తహీనత కేసులు తగ్గుముఖంపట్టాయని కేంద్ర బృందం ప్రతినిధులు డాక్టర్ దృష్టిశర్మ, డాక్టర్ జాస్మిన్ అభిప్రాయపడ్డారు. గత రెండు రోజులుగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో రక్తహీనత తగ్గడానికి గల కారణాలపై అధ్యయనం చేశారు. సంబంధిత అంశాలను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలిసి వివరించారు. ఎనిమీయా ముక్త్ భారత్, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థ, జాతీయగ్రామీణ జీవనోపాధుల కార్యక్రమాలు రక్తహీనత తగ్గించేందుకు దోహదపడుతున్నాయన్నారు. దేశంలోని ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 12 జిల్లాల్లో రక్తహీనత తగ్గుదలకు గల కారణాలపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జీవన రాణి పాల్గొన్నారు.

జీరో చూసుకోండి!

- పెట్రోల్ బంకుల్లో యథేచ్ఛగా మోసాలు
- అధికారుల తనిఖీలు నామమాత్రం
- జిల్లాలో పర్యవేక్షించే శాఖ కరువు
- ఏడాదిలో ఏడు కేసులే నమోదు



సాక్షి, పార్వతీపురం మన్యం:

సాధారణంగా వాహనదారులు పెట్రోల్ బంకుకు వెళ్లి.. ఇంధనం పోయాలని అక్కడికి సిబ్బందికి అడిగిన వెంటనే... వారు 'జీరో చూసుకోండి' అని ఎంతో వినయంగా చెబుతారు. మన దృష్టి కూడా ఆ 'సున్నా'పైనే ఉంటుంది. జీరో ఉన్నంత మాత్రాన మనం మోసపోం అనుకుంటే పొరపాటే. బంకుల్లో ఎప్పటికప్పుడు నయా మోసాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. వినియోగదారులు నష్టపోతూనే ఉన్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు తనిఖీలు లేకపోవడం.. వినియోగదారులు సైతం దీనిపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో జిల్లాలో పెట్రో ల్ బంకుల నిర్వాహకులు యథేచ్ఛగా దోపిడీకి తెరతీస్తున్నారు.

ఇదో 'జంప్ ట్రిక్' మోసం


జిల్లాలో 48 వరకు పెట్రోల్ బంకులు ఉన్నాయి. కొన్ని బంకుల్లో 'జంప్ ట్రిక్' మోసానికి పాల్పడుతున్నారు. పెట్రోల్ కొట్టేటప్పుడు అక్కడ సిబ్బంది 'జీరో చూసుకోండి' అని చెబుతుంటారు. పెట్రోల్ పోయడం మొదలుపెట్టగానే మీటరు నెమ్మదిగా పెరగకుండా ఒక్కసారిగా 10–20 పాయింట్లు పెరుగుతుంది. దీనివల్ల మనకు తక్కువ పెట్రోల్ పోసినా, మీటరులో ఎక్కువ చూపిస్తుంది. సాధారణంగా మీటరు నాలుగైదు పాయింట్లు మాత్రమే జంప్ అవ్వాలి. జిల్లాలోని అనేక బంకుల్లో ఈ తరహా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా ఇది గమనించి అడిగినా.. పెట్రోల్ బంకు సిబ్బంది నుంచి మౌనమే సమాధానంగా వస్తోందని వాహనచోదకులు చెబుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

పెట్రోల్‌బంకుల వద్ద ఎక్కడా కనీస సౌకర్యాలు ఉండటం లేదు. ప్రతి బంకు వద్ద మరుగుదొడ్లు, గాలి పంపులు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉంది. అవి ఎక్కడా ఉన్న దాఖలాలు లేవు.

కనీసం జాతీయ రహదారి వెంబడి ఉన్న బంకుల్లోనూ ఈ తరహా సౌకర్యాలు శూన్య మని వాహనదారులు చెబుతున్నారు. పెట్రోల్ బంకుల్లో మోసాలపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. కనీసం ఇప్పటికైనా తనిఖీలు ముమ్మరం చేస్తే వాహన చోదకులకు మేలు జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారుల తనిఖీలు లేకపోవడం.. ఎక్కువగా నిరక్షరాస్యులున్న ఏజెన్సీ ప్రాంతం కావడంతో పెట్రోల్ కొలతల్లోనూ తేడా కనిపిస్తోంది. బాటిల్ పట్టుకుని, లీటరు చొప్పున కొనుగోలు చేస్తే బాగానే ఇస్తున్నారని.. అదే నేరుగా బండిలో ఇంధనం పోయించుకుని, కిలోమీటర్లు లెక్క గడితే... 10–15 కిలోమీటర్లకు ముందుగానే రిజర్వ్‌కు వచ్చేస్తోందని పార్వతీపురం పట్టణానికి చెందిన సురేష్ అనే వాహనదారుడు వాపోయాడు. పార్వతీపురం పట్టణంలోని ఓ బంకులో 'సాక్షి' శుక్రవారం పరిశీలించగా.. 500 ఎంఎల్‌కు 2 ఎంఎల్ పెట్రోల్ తక్కువగా వచ్చింది.



పార్వతీపురంలోని ఓ పెట్రోల్ బంకులో 500 ఎంఎల్‌కు 2 ఎంఎల్ తక్కువగా వచ్చిన దృశ్యం

సాలూరులోని ఓ బంకులో కొంత కాలంగా పెట్రోల్ కల్తీ జరుగుతోందన్న ప్రచారం జోరుగా ఉంది. కల్తీతోపాటు కొలతల్లో కూడా తేడా ఉందని వాహనదారులు చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో గిరిజనులు పెట్రోల్ పోయించేటప్పుడు కొలతల్లో తేడా చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కూడా పెద్దగా దృష్టి సారించడం లేదు. జిల్లా విభజన తర్వాత పార్వతీపురం మన్యానికి తూనికలు, కొలతలు విభాగ కార్యకలాపాలు పెద్దగా కనిపించడం లేదు. గత ఏడాది కాలంలో బంకుల్లో జరుగుతున్న మోసాలపై కేవలం ఏడు కేసులే నమోదు చేయడం గమనార్హం. రూ.లక్షా పది వేలను అపరాధ రుసుంగా విధించినట్లు తూనికలు కొలతలు శాఖల అధికారులు చెబుతున్నారు. వినియోగదారుల్లో ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం వల్ల కూడా అధికారుల తనిఖీలు శూన్యమవుతున్నాయి.



రోడ్డే కళ్లం..

మొక్కజొన్న పంట చేతికొచ్చింది. నూర్పిడి చేసిన పిక్కలు ఆరబెట్టేందుకు అవసరమైన టార్పాలిన్లను ప్రభుత్వం రాయితీపై అందజేయలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైనే ఆరబెడుతున్నారు. పంటను సైతం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు క్వింటా రూ.2,160 చొప్పున విక్రయిస్తున్నట్టు వీరఘట్టం మండలంలోని పనసనందివాడ, ఎం.వి.పురం, తెట్టంగి, నీలానగరం, తలవరం, కుమ్మరిగుంట, కిమ్మి, గడగమ్మ తదితర గ్రామాల రైతులు బెబుతున్నారు. - వీరఘట్టం

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

- మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: జిల్లాలో ఖాళీగా ఉన్న 17 అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి డాక్టర్ టి.కనకదుర్గ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో రెండు సహాయక పోస్టులు, సాలూరు పరిధిలో మూడు సహాయక పోస్టులు, బలిజిపేట ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, మూడు సహాయక పోస్టులు, సీతానగరంలో రెండు సహాయక పోస్టులు, పాలకొండ డివిజన్‌లోని పాలకొండలో మూడు సహాయక పోస్టులు, భామిని ప్రాజెక్టు పరిధిలో రెండు సహాయక పోస్టులు, వీరఘట్టంలో ఒక సహాయక పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థినులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అంగన్‌వాడీ సహాయకులకు జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. ఎస్టీ కేంద్రాలకు ఎస్టీ కేటగిరికి రోస్టర్‌లో రిజిస్టర్ కాబడిన పోస్టులకు 21ఏళ్లు నిండిన అభ్యర్థులు అర్హులని, లేదంటే 18 ఏళ్లు నిండిన వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు.



డా.టి.కనకదుర్గ

తాడి ప్రకాష్‌కు పతంజలి పురస్కారం

విజయనగరం గంటస్తంభం: ప్రముఖ పాత్రికేయుడు, సినీ మాటల రచయిత కె.ఎన్.వై.పతంజలి 73వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు, పతంజలితో పాతికేళ్ల పాటు కలిసి పనిచేసిన రచయిత తాడి ప్రకాష్‌కు పతంజలి పురస్కారం అందజేయనున్నట్టు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. గురజాడ అప్పారావు గృహంలో వేదిక ప్రతినిధులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఏటా పతంజలి జయంతి సందర్భంగా ప్రముఖులకు పురస్కారం అందజేస్తున్నామన్నారు. 2025 సంవత్సరానికి గాను తాడి ప్రకాష్‌కు ఈ నెల 29 తేదీన గురుజాడ గ్రంథాలయంలో పురస్కారం ప్రదానం చేస్తామని చెప్పారు. సాహిత్య అభిమానులు, రచయితలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వేదిక కార్యదర్శి బాబు, లక్ష్మణరావు, పౌరవేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.



తాడి ప్రకాష్

ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

- నిర్వాసితులను మోసం చేయడం అన్యాయం
- ఎంపీ మాట మార్చడం బాధాకరం
- 27, 28వ తేదీల్లో నిరాహార దీక్షలు
- మూడవ రైల్వే లైన్ నిర్వాసితుల కమిటీ నాయకుడు శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మూడవ రైల్వేలైన్ నిర్వాసితుల కమిటీ నాయకుడు శ్రీనివాస్

గజపతినగరం: టిట్లాగర్ నుంచి విజయనగరం వరకు సుమారు 4 వేల కోట్ల రూపాయలతో చేపడుతున్న మూడవ రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదని, సమయం వచ్చినప్పుడు గట్టిగా బుద్ధిచెబుతామని రైల్వే లైన్ నిర్వాసితుల కమిటీ నాయకుడు జి.శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో మూడో రైల్వే లైన్ నిర్మాణంలో ముందుగా 14 ఇళ్లకు అరకొర డబ్బులు చెల్లించి వాటిని కూల్చివేశారని, తరువాత మరో 28 కుటుంబాలకు చెందిన వారి ఇళ్లను కూల్చి వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. నిర్వాసితులకు నిలువునీడ చూపకుండా ఇళ్లు కూల్చివేయడం దుర్మార్గమన్నారు. ఫిబ్రవరి 9వ తేదీన బాధితులకు న్యాయం చేస్తామంటూ మాట ఇచ్చిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇప్పుడు మాటమార్చారని విమర్శించారు. నిర్వాసితుల పక్షాన కాకుండా ఇళ్లను కూల్చే కాంట్రాక్టర్ తరఫున కొమ్ముకాయడం దారుణమన్నారు. తక్షణమే నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు, పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మార్చి 27, 28 తేదీల్లో మానాపురం బ్రిడ్జి సమీపంలో రెండు రోజుల పాటు నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ సమస్య పరిష్కరించకుంటే ఏప్రిల్ 2వ తేదీన చలో తహసీల్దార్ ఆఫీస్ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో నిర్వాసితుల కమిటీ నాయకులు చిల్లా గోవింద్, బోర మహేష్, నగిరెడ్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిధులకు ప్రతిపాదనలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: జిల్లా వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు సాధించాలంటే తోటపల్లి కుడి ప్రధాన కాలువ, తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టులు పూర్తి కావాలి... దీనికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని త్వరలో జరిగే కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఆయా ప్రాజెక్టుల పనులు, భూసేకరణ, పునరావాసం పూర్తి చేసేందుకు ఏ మేరకు నిధులు అవసరమవుతాయో జలవనరుల శాఖ అధికారులు నివేదిక అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం మాట్లాడారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ, తారకరామ సాగరం ప్రాజెక్టులను పూర్తిచేస్తే సుమారు 50 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. వ్యవసాయ రంగంలో అదనపు ఉత్పత్తిని, ఆదాయాన్ని సాధించే అవకాశం ఉంటుందన్నారు. మరోవైపు నగరానికి మంచినీటి సరఫరా, భోగాపురం ఎయిర్ పోర్టుకు నీటి సరఫరా జరిగే అవకాశం ఉన్నందున ఈ ప్రాజె క్టు త్వరగా పూర్తిచేయాల్సిన అవసరాన్ని వివరిస్తా మని చెప్పారు. కలెక్టర్ల సదస్సు మార్చి 25, 26 తేదీల్లో అమరావతిలో జరగనుందని, జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై ప్రజంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వివిధ శాఖల అధికారులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎంతమేరకు లక్ష్యాలు సాధించగలమో పేర్కొంటూ వాస్తవిక అంచనాలను మాత్రమే ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

'బంగారు కొండ'పై ఒడిశా కన్ను

- వివాదాస్పద కొటియా పల్లెల్లో ఒడిశా దుందుడుకు
- గిరిజనులకు పోలీసులతో బెదిరింపు
- కొండచుట్టూ స్తంభాల ఏర్పాటు
- సాగుభూములు లాక్కోవడంతో ఆందోళన
- గతంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేసిన ఆంధ్రా ప్రభుత్వం
- పవర్ స్టేషన్ నిర్మాణం కోసమంటూ బుకాయింపు...
- మైనింగ్ తవ్వకాలకే కొండ ఆక్రమణ అంటున్న గిరిజనం
- మౌనం దాల్చిన గిరిజన సంక్షేమశాఖ మంత్రి!

సాలూరు:

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా పల్లెల్లో ఒడిశా ప్రభుత్వం దుందుడుకు చర్యలకు పాల్పడుతోంది. ఇటీవల జల్‌జీవన్ మిషన్ పనులకు వెళ్లిన ఆంధ్రా సిబ్బందిని అడ్డుకుంది. సామగ్రిని సీజ్‌చేసి పోలీసులతో భయపెట్టింది. తాజాగా ఆంధ్రాప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేసిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూములను లాక్కునేందుకు పూనుకుంది. గిరిజనుల పోడు సాగుకు ఆధారమైన గంజాయిభద్ర పంచాయతీ ఎగువశెంబి వద్ద ఉన్న బంగారు కొండ దురాక్రమణకు ఒడిగట్టింది. ఒడిశా అధికారులు పోలీస్ బలగాలతో శుక్రవారం వచ్చి భూమి పూజచేసి, కొండచుట్టూ సిమెంట్ పోల్స్‌ను పాతారు. దీనిని అడ్డుకున్న గిరిజనులపై దౌర్జన్యానికి దిగారు. ఇక్కడ ఏమీ చేయడానికి లేదని, ఈ భూముల్లోకి ఇకపై ఎవరూ రాకూడదని హెచ్చరికలు జారీచేశారు. ఒడిశా అధికారులు దౌర్జన్యాన్ని వీడియోలు, ఫొటోలు తీయకుండా గిరిజనుల నుంచి సెల్‌ఫోన్లు లాక్కున్నారు. తొలి రోజు కొండచుట్టూ కొంత మేర పోల్స్‌ను పాతారు.



ఎగువశెంబి సమీపంలో కొండ చుట్టూ పాతేందుకు సిద్ధంగా ఉంచిన పోల్స్

మిగిలిన ప్రాంతంలో పాతేందుకు వీలుగా పోల్స్‌ను సిద్ధం చేశారు. పవర్‌స్టేషన్ నిర్మాణం కోసమని ఒడిశా అధికారులు చెబుతున్నా, ఇదంతా ఇక్కడ ఉన్న విలువైన ఖనిజ నిక్షేపాలు కొల్లగొట్టేందుకేనని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

మైనింగ్‌కు సన్నాహాలు?

వివాదాస్పద కొటియా గ్రూపు గ్రామాలు ఉండే కొండల్లో విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. ఈ ప్రాంతాలను సొంతం చేసుకునేందుకు గతంలో ఒడిశా ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడగా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆంధ్రా అధికారులను అప్రమత్తం చేసి అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొటియా పల్లెలపై ఆంధ్రా ప్రభావం సన్నగిల్లుతోంది. దీంతో ఒడిశా అధికారుల దౌర్జన్యం పెరిగిందని స్థానిక గిరిజనులు చెబుతున్నారు.



ఎగువశెంబి సమీపంలో కొండ చుట్టూ ఒడిశా అధికారులు పాతుతున్న పోల్స్

స్పందించని మంత్రి?

కొటియా పల్లెల్లో ఒడిశా దురాక్రమణలకు పాల్పడుతున్నా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కిమ్మనకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి మౌనం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదంటూ గిరిజనులు వ్యాఖ్యానిస్తున్నారు. రెండు చోట్ల బీజేపీ పాలిత ప్రభుత్వాలే ఉన్నాయని, సమస్యను పరిష్కరించాల్సిన పాలకు లు మిన్నకుండడాన్ని గిరిజనులు తప్పుబడుతున్నా రు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొటియా గ్రామాల అంశంపై నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒడిశా సీఎమ్ నవీన్‌పట్నాయక్‌తో చర్చించిన అంశాన్ని గుర్తుచేస్తున్నారు. నాడు ప్రతిపక్షంలో ఉంటూ విమర్శలు చేసిన నేటి మంత్రి గుమ్మి డి సంధ్యారాణి... ప్రత్యేక చొరవ చూపాలని, దశాబ్దాల కొటియా గ్రూప్ గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సీఎం చంద్రబాబుతో మాట్లాడాలని గిరిజనులు కోరుతున్నారు.

క్లుప్తంగా

జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే



సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి, పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు ప్రదర్శన



పరుగు ప్రదర్శనలో దౌడు తీస్తున్న గుర్రం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థం సందర్భంగా నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పరుగు ప్రదర్శనలో 12 గుర్రాలు పాల్గొన్నాయి. వాటిలో రామన్న పాలెంకు చెందిన విక్రమ్ గుర్రం ప్రథమస్థానంలో నిలిచి రూ.12 వేలు, రెండోస్థానంలో చేనుల అగ్రహారానికి చెందిన మణి జెర్సీ నిలిచి రూ. పదివేలు సాధించాయి. మూడో స్థానంలో రామన్న పాలెంకు చెందిన చోడమాంబిక గుర్రం, నాల్గో స్థానంలో ఎల్.కోటకు చెందిన సింగపూర్ సత్యనారాయణ గుర్రం నిలిచి నగదు బహుమతులు సాధించాయి. విజేతలకు ఆలయ ధర్మకర్తలు, పెద్దలు కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

'గేట్' లో కార్తికేయ కుశల్ కుమార్‌కు 79వ ర్యాంక్



కార్తికేయ కుశల్‌కుమార్

విజయనగరం అర్బన్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్-2025) ఫలితాల్లో పట్టణ విద్యార్థి గంట కార్తికేయ కుశల్ కుమార్ జాతీయ ర్యాంక్ 79 సాధించాడు. గేట్‌లోని ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ (ఈసీఈ) సబ్జెక్టులో 842 స్కోర్‌తో 79వ ర్యాంక్ తెచ్చుకున్నాడు. కార్తికేయ బీటెక్ కాలికట్ ఎన్‌ఐటీలో చదివాడు. మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంక్ సాధించిన కార్తికేయ తండ్రి జి.సునీల్ కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా తల్లి శోభ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయిని.


పోక్సో కేసులో 12 ఏళ్ల జైలుశిక్ష

భామిని: మండలంలోని బిల్లుమడకు చెందిన మండల శివ అనే ముద్దాయికి పోక్సో కేసులో విచారణ అనంతరం శుక్రవారం 12 ఏళ్ల జైలు శిక్షను కోర్టు విధించినట్లు బత్తిలి ఎస్సై డి.అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో బిల్లుమడ గ్రామంలో ఓ చిన్నారిపై మండల శివ అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జిల్లా న్యాయమూర్తి విచారణ అనంతరంనేరారోపణ నిర్ధారించి శిక్ష విధించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సీతంపేట: మండలంలోని మాసదుగూడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకోవడంతో ఎస్.గణపతి, మనోజ్‌లకు గాయాలు కాగా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించడంతో మెరుగైన వైద్యం కోసం గణపతిని రిమ్స్‌కు రిఫర్ చేసినట్లు ఏరియా ఆస్పత్రి ప్రధానవైద్యాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు.

అదృశ్యం కేసు నమోదు



నీలయ్య

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల గ్రామానికి చెందిన నీలయ్య జనవరి 20 నుంచి ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు. బంధువులు, పరిచయస్తుల ఇళ్ల వద్ద భర్త ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందంటూ భార్య ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹194



భూగర్భజలమట్టాలను ఫిజియోమీటర్ల ద్వారా పరీక్ష చేస్తున్న అధికారులు



భూగర్భజలశాఖ కార్యాలయం

జలకలం..!

- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- ఇప్పటికే మీటరు లోతుకు వెళ్లిన నీటిమట్టం
- రైతులకు జల సంరక్షణపై అవగాహన
- నేడు ప్రపంచ జల దినోత్సవం

విజయనగరం టౌన్: వేసవి ప్రారంభమైంది. జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. నీటి వనరులు ప్రస్తుతం అవసరం మేరకు లభ్యమవుతున్నప్పటికీ వాతావరణంలో వచ్చే మార్పుల ప్రభావం, రైతులు, ప్రజలకు భూగర్భజలాలను సంరక్షించుకోవడంలో సరైన అవగాహన లేకపోవడంతో జల లభ్యతలో తగ్గుదల కనిపిస్తోంది. ఫిబ్రవరి, మార్చి నెల మధ్య ఏకంగా మీటరు లోతున నీటి మట్టం తగ్గిపోయినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నీటిమట్టం ప్రస్తుతానికి అధికారిక లెక్కల ప్రకారం బాగానే ఉన్నప్పటికీ నెలరోజుల వ్యవధిలోనే మీటరు లోతున తగ్గిపోవడంతో హెచ్చరికలు ప్రారంభమయ్యాయనే చెప్పవచ్చు. రానున్న ఏప్రిల్, మే, జూన్ నెల నాటికి మరింతగా ప్రమాద ఘంటికలు మోగనున్నాయనడంలో సందేహం లేదు. ఏదైమైనప్పటికీ రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం.

జిల్లాలో ఈ ఏడాది జనవరి నెలలో భూమట్టానికి 3.50మీటర్ల వరకూ ఉండే నీటిమట్టం, ఫిబ్రవరి నాటికి 4.53కి పడిపోయింది. జిల్లాలోని గుర్ల, గజపతినగరం, రామభద్రపురం, జామి, రాజాం, సంతకవిటి, గంట్యాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ, రేగిడిఆమదాలవలస మండలాల్లో మూడు మీటర్ల వరకూ ప్రస్తుతానికి నీటిమట్టాలు బాగానే ఉన్నాయి. ఇక తెర్లాం, వంగర, డెంకాడ, ఎస్.కోట, చీపురుపల్లి, మెరకముడిదాం, మెంటాడ, దత్తిరాజేరు, కొత్తవలస, ఎల్.కోట, భోగాపురం, వేపాడ, విజయనగరం, బాడంగి, బొబ్బిలి, బొండపల్లి మండలాల్లో 3 నుంచి 8 మీటర్ల వరకూ నీటిమట్టాలు ఉన్నాయి. 8 నుంచి 20 మీటర్ల ప్రమాదస్థాయిలో గరివిడి మండలంలో నీటిమట్లాలు ఉన్నాయి. భూగర్భ జల మట్టాలను కొలిచే ఫిజియోమీటర్లు జిల్లాలో 50 వరకూ ఉన్నాయి. వాటి ద్వారా భూగర్భజల శాఖ అధికారులు నీటిమట్టపు కొలతను సేకరిస్తుంటారు. తద్వారా భూగర్భ స్థితిగతులను అంచనా వేసి ,జిల్లా ప్రజలకు జల స్థితిగతులపై అవగాహన కల్పిస్తారు. నీటి సంరక్షణకు తగిన సాంకేతిక సలహాలిస్తుంటారు. ప్రధానంగా రైతులు రాబోయే వర్షాకాలంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టి ఫారం పాండ్స్ ఏర్పాటు చేసుకోవడంపైన, వర్షపు నీరు వృథాగా పోకుండా చిన్నపాటి గట్లు నిర్మించే విధంగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

జల సంరక్షణకు చర్యలు



ప్రస్తుతం భూగర్భ జలాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లా ప్రజలు జలసంక్షణ చర్యలు చేపట్టాలి. వాన నీటిని సంరక్షించుకోవాలి. భూగర్భజలాలను పెంచుకునేందుకు రీచార్జ్ స్ట్రక్చర్స్‌ను నిర్మించుకోవాలి. భావితరాలకు నీటిఎద్దడి లేకుండా చూడాల్సిన అవసరం మనందరిపైనా ఉంది.

– ఎస్‌వీకె.దుర్గాప్రసాద్, జిల్లా భూ గర్భజల శాఖ అధికారి, విజయనగరం

రైల్వే ఉద్యోగుల నిరసన



మాట్లాడుతున్న డివిజనల్ కో ఆర్డినేటర్ పీవీ.మౌళీశ్వరరావు

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వేశ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కోఆర్డినేటర్ పీవీ.మౌళీశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన ట్రాఫిక్ కారణంగా అన్ని ఎల్‌సీ గేట్లకు 8 గంటల రోస్టర్‌ను అమలుచేయాలన్నారు. ట్రాక్ మెయింటైనర్లకు సైకిల్ అలవెన్స్‌చెల్లింపును నిర్ధారించాలని, రన్‌ఓవర్ కేసుల్లో స్టేషన్ మాస్టర్లకు మెమోలు ఇచ్చే ట్రాక్ మెయింటైనర్లను నివారించాలని బదులుగా సీయూజీ ఫోన్‌ల ద్వారా సంబంధిత కీమాన్, ట్రాక్ మాన్‌ల నుంచి వివరాలను పొందడంపై పీడబ్ల్యూవే సూపర్ వైజర్‌ల ద్వారా మెమోలను అందించేందుకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్యుపెన్సీని పెంచేందుకు క్వార్టర్స్ మెరుగైన నిర్వహణ చేపట్టాలని కోరారు. సేఫ్టీ కేటగిరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు రిస్క్, హార్డ్‌షిప్ అలవెన్స్ అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రామిక్ కాంగ్రెస్ విజయనగరం బ్రాంచ్ కార్యదర్శి బి.సత్యనారాయణ, శ్రీకాకుళం బ్రాంచ్ కార్యదర్శి ఎస్.దంతేశ్వరరావు, సెంట్రల్ ఆఫీస్ బేరర్ ఎం.అనిల్ కుమార్, బి.శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

25న పాలకొండలో జాబ్‌మేళా

పార్వతీపురంటౌన్: ఈ నెల 25న పాలకొండలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఎనీ డిగ్రీ చదివి 18 నిండి 29 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి శ్రీ సత్య సాయి డిగ్రీ కాలేజీ, పాలకొండలో సంకల్ప్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీల్లోకి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులకు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్//నైపుణ్యం .ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెస్యూమె, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్,1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో జాబ్‌మేళా జరిగే ప్రదేశంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6301275511, 7993795796 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీస్ సిబ్బంది విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను విజ్ఞాపనల ద్వారా స్వీకరించి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం తన కార్యాలయంలో పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది విన్నవించిన సమస్యల్లో సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న వాటిని తక్షణమే పరిష్కరిస్తామని వెంటనే పరిష్కారం కాని సమస్యలకు త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. అలాగే సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సిబ్బందికి వృత్తి, ఆరోగ్య, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి సిబ్బందికి ప్రత్యేకంగా గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



ఆలవెల్లి రాజా (ఫైల్)

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు వద్ద శుక్రవారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు స్థానిక ఎస్సై పి.రమేష్ నాయుడు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. తోటపల్లి ప్రాజెక్టు నాల్గవ గేటు వద్ద యువకుడి మృతదేహం తేలియాడుతూ ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని బయటకు తీసిన తరువాత మృతుడిని పార్వతీపురం పట్టణంలో గల జగన్నాథపురం ప్రాంతానికి చెందిన ఆలవెల్లి రాజా(26)గా గుర్తించారు. ఈనెల 19 బుధవారం ఉదయం నుంచి కుమారుడు ఆలవెల్లి రాజా ఆచూకీ లేకపోవడంతో తండ్రి శ్రీనివాసరావు పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేయగా శుక్రవారం తోటపల్లి జలాశయం వద్ద రాజా మృతదేహం లభ్యమైంది. మృతికి గల కారణాలు తెలియకపోవడంతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

ఫెన్సింగ్ పోటీల్లో కానిస్టేబుల్‌కు కాంస్యం

- అభినందించిన ఎస్పీ వకుల్ జిందల్



ట్రాఫిక్ కానిస్టేబుల్ మూర్తిని అభినందిస్తున్న ఎస్పీ వకుల్, పక్కనే సీఐ సూరినాయుడు, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ గోపాలనాయుడు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగిన 1వ ఆలిండియా పోలీస్ క్లస్టర్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన పీసీ బీఎస్ ఎన్ మూర్తికి ఎస్పీ వకుల్ జిందల్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని ట్రాఫిక్ సీఐ సూరినాయుడుతో పాటు కానిస్టేబుల్ మూర్తి శుక్రవారం కలిశారు. జిల్లాకు చెందిన బీఎస్ఎన్ మూర్తి పోలీస్ శాఖ నిర్వహించిన జాతీయపోటీల్లో ఫెన్సింగ్ విభాగంలో రాష్ట్ర పోలీసు జట్టు తరపున పాల్గొని కాంస్య పతకం సాధించాడు. కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ మూర్తిని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అభినందించారని ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా తెలిపారు. పతకాలు సాధించిన పోలీస్‌సిబ్బందికి త్వరలో ప్రోత్సాహక నగదు బహుమతిని, అదనంగా వార్షిక ఇంక్రిమెంట్ అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు



జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 10,363 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 10,314 మంది హాజరయ్యారని, 49 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించామన్నారు. 61 పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షక బృందం 6 కేంద్రాల్లో తాను సందర్శించినట్లు తెలిపారు.

టూరిజం ఛాయా చిత్ర పోటీలు



టూరిజం అధికారి ఎన్.నారాయణ రావు

పార్వతీపురంటౌన్: ఉత్తమ పర్యాటక ఛాయాచిత్రాలను పర్యాటకశాఖ ఆహ్వానిస్తోందని టూరిజం అధికారి ఎన్.నారాయణ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫొటోగ్రాఫర్‌లు, కథకులు, ప్రభావశీలురు, పౌరులు భారతదేశ సాంస్కృతిక, సహజవారసత్వ సారాంశాన్ని సంగ్రహించే ఉత్తమ ఛాయా చిత్రాలను సమర్పించాలని కోరారు. పర్యాటక మంత్రిత్వశాఖ దేఖో అపనా దేశ్- పీపుల్ చాయిస్ -2024 నినాదం కింద మార్చి 7న దేఖో అపనా దేశ్ ఫోటో కాంటెస్ట్‌ను ప్రారంభించిందని దేశంలోని వివిధ ప్రాంతాల్లో విభిన్నమైన పర్యాటక ప్రాంతాల గొప్పతనాన్ని చాటడం, ప్రదర్శించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అన్ని రాష్ట్రాలు తమ చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ ప్రయత్నిస్తోందని, పర్యాటక గమ్యస్థానాలు, తమ పర్యాటక సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు, సందర్శకులను ఆకర్షించడానికి ఇది ఒక విలువైన వేదిక కానుందని తెలిపారు. ఎంట్రీల సమర్పణకు చివరితేదీ ఏప్రిల్ 7 అని తెలిపారు. స్థానిక ఫొటోగ్రాఫర్‌లు, పౌరులు, టూరిజం బోర్డుల ఇతర సంబంధిత భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడానికి మంచి అవకాశమని తెలియజేశారు.

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన లీలాసత్య

పార్వతీపురం రూరల్: వివాహమైన ఏడాదికే అత్తవారింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై ఎస్సై బి.సంతోషి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొడ్డవలస గ్రామానికి చెందిన నాదెళ్ల లీలాసత్య(36) అత్తవారింట్లో వరకట్నం వేధింపులు, అవమానాలు తాళలేక ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి నాదెళ్ల దుర్గారావు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు మృతురాలి భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



బిడ్డిక వెంకటి మృతదేహం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని రావాడ రామభద్రపురం గ్రామానికి చెందిన బిడ్డిక వెంకటి (55) పాముకాటుతో శుక్రవారం మృతిచెందాడు. సాయంత్రం 6 గంటల సమయంలో పొలం పనులు ముగించుకుని వస్తుండగా మార్గమధ్యంలో నాగుపాము కాటువేసింది. ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలియజేసి, రావాడ రామభద్రపురం పీహెచ్‌సీలో చేరాడు. అక్కడి వైద్యులు ప్రాథమిక వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ మేరకు 108లో పార్వతీపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటి మృతిచెందాడు. అయినప్పటికీ కుటుంబసభ్యులు సమీపంలోని చినమేరంగి సీహెచ్‌సీకి తీసుకెళ్లగా వెంకటి మృతిచెందినట్లు అక్కడి వైద్యురాలు పూర్ణ చంద్రిక ధ్రువీకరించారు.

నెలాఖరుకు పథకాల మంజూరు

- కలెక్టర్ అంబేడ్కర్



ప్రణాళిక నోట్స్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు ఈ నెలాఖరులోగా పథకాలను మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. వివిధ పథకాలు, వాటి మంజూరులో బ్యాంకుల పరిస్థితిని ఎల్‌డీఎం వీవీరామణమూర్తి వివరించారు. నాబార్డ్ డీడీఎం నాగార్జున మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాబార్డ్ పొటెన్షియల్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌సీపీ)ను వివరించారు. సుమారు రూ.10,650.32 కోట్ల అంచనాతో ఈ రుణ ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. దీని ఆధారంగానే జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ ప్రణాళికను కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, వ్యవసాయ శాఖ జేడీ వీటీరామారావు, పశుసంవర్ధక శాఖ డాక్టర్ వైవీరమణ, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, మెప్మా పీడీ చిట్టిరాజు, ఉద్యాన, మత్స్యశాఖల డీడీలు జమదగ్ని, నిర్మలాకుమారి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు వెంకటేశ్వరరావు, పెంటోజీరావు, వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేతనదారులకు నిలువనీడ కరువు

- పనిప్రదేశంలో మెడికల్ కిట్లు లేవు
- మండుటెండలోనే పనులు
- 8 వారాలుగా వేతనాలు అందక విలవిల



కుడ్డపల్లి ఉపాధి పనుల్లో నిలువనీడ లేకుండా పనులు చేస్తున్న వేతనదారులు



పెద్దూరులో పనులు చేస్తున్న వేతనదారులు

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట మండలం ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ పనులు చేయడంలో ముందంజలో గత కొన్నేళ్లుగా ఉంది. ఈ మండలంలో ఎక్కువ పనులు జరుగుతాయి. అటువంటి ఈ మండలంలో ఉపాధి వేతనదారులకు నిలువ నీడ లేదు. మండుటెండలో విలవిల్లాడుతున్నారు. వేసవి వచ్చినా కనీసం టెంట్లు కూడా లేకపోవడంతో వేతనదారులకు అవస్థలు తప్పడం లేదు. అసలే వేసవి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపాధి పనులు చేస్తుంటారు. ఆ సమయంలో అత్యధికంగా ఎండ కాస్తోంది. ఉదయం 8 గంటలైతే భానుడు భగభగ మంటున్నాడు. సాయంత్రం 5 గంటల వరకు ఎండలు మండుతున్నాయి. విశ్రాంతి తీసుకోవడానికి కనీసం నీడ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వేతనదారులు వాపోతున్నారు. అలాగే పని సమయంలో వడదెబ్బ వంటివి, చిన్నచిన్నదెబ్బలు తగులుతుంటాయి. ఈ సమయంలో ప్రాథమిక చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు పని ప్రదేశం వద్ద ఉండాలి. వాటిని కూడా ప్రభుత్వం ఇంతవరకు సప్లై చేయకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వాపోతున్నారు. వేతనదారులు డీహైడ్రేషన్‌కు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్ కూడా లేని పరిస్థితి ఉంది.

బకాయిలు రూ.5 కోట్లకు పైనే..

వేతనదారులకు చెల్లించాల్సిన వేతనాల బకాయిలు రూ.కోటి వరకు ఉండవచ్చని అంచనా. మెటీరియల్ కాంపొనెంట్‌లో వేసిన రహదారులు, హార్టీకల్చర్, ఇతర పనులు దాదాపు 200 వరకు జరగడంతో వాటికి చెల్లించాల్సిన బకాయిలు రూ.4 కోట్ల వరకు ఉండవచ్చని సమాచారం. వేతనదారులు చేసిన భూ అభివృద్ధి పనులు వంటి వాటికి ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించాల్సి ఉంది. దాదాపు ఉపాధి వేతనదారులు జాబ్‌కార్డులు ఉన్నవారు 18 వేల మంది ఉన్నారు. వారిలో వందరోజుల పనులు పూర్తి చేసిన వారు 80 శాతం వరకు ఉండడంతో ప్రస్తుతం పనులు చేస్తున్న వేతనదారులు 3 వేలమంది ఉన్నారు. భూ అభివృద్ధి, టెర్రాసింగ్, ఫార్మ్‌పాండ్ పనులు వేతనదారులు చేస్తున్నారు. ఇలా 150 వరకు పనులు చేశారు. సరాసరి ఒక్కో వేతనదారుకు రోజుకు రూ.270 వరకు వేతనం గిట్టుబాటవుతుంది. రెండు నెలలుగా బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వేతనదారులు ఆవేదన చెందుతున్నారు.

కొలతలకు టేప్ సప్లై లేదు..

ఉపాధి పనులు చేసిన వేతనదారుల పనులు ఎంత పూర్తి చేశారనేది సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది కొలతలు వేయడానికి వీలుగా టేపులు సప్లై చేయాల్సి ఉన్నప్పటికీ అవికూడా సరఫరా చేయని పరిస్థితి ఉంది. కేవలం ఎవరి సామగ్రి వారు తెచ్చుకునే పనుల కొలతలు వేస్తున్నారు.

టెంట్లు తాత్కాలికంగా వేసుకోమన్నాం

వేతనదారులు పనిచేసిన చోట టెంట్లు తాత్కాలికంగా వేసుకుంటున్నారు. ఎండ తీవ్రత లేని సమయంలో ఉదయం 7 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు పనులు చేసుకుంటున్నారు. బకాయి నిధులు మంజూరైన వెంటనే వేతనదారులకు వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటాం.

శ్రీహరి, ఏపీడీ, ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్